జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 23 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5



## గెలల రాకతో కళకళలాడుతున్న ఆయిల్ పామ్ కర్మాగారాలు

- అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీల వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు
- రోజుకు 500 నుండి 600 టన్నుల దిగుబడి నమోదు



**అశ్వారావుపేట, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి ):** గత రెండు నెలలుగా సరైన దిగుబడి లేక బోసిపోయిన ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కర్మాగారాలు, ఇప్పుడు గెలల రాకతో మళ్లీ కళ కళలాడుతున్నాయి అశ్వారావుపేటతో పాటు అప్పారావు పేటలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలకు స్థానిక, సమీప ప్రాంతాల రైతులు భారీగా పామాయిల్ గెలలను తరలిస్తు న్నారు. ఆయిల్ పామ్ సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడుతుండటంతో గత మూడు రోజులుగా తోటల్లో కోతలు ముమ్మరమై, ఫ్యాక్టరీలకు గెలల రాక గణనీ యంగా పెరిగింది. ప్రస్తుతం అశ్వారావుపేట కర్మాగారా నికి రోజుకు సుమారు 500 నుండి 600 టన్నుల వరకు గెలలు వస్తున్నట్లు సమాచారం

మిగతా 2 లో...

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తొలి షూటింగ్ బంగారు పతకం




- సూపర్ బిగ్ బోర్ షూటింగ్ పోటీల్లో అయ్మాన్ ముస్కాన్ పఠాన్ ప్రతిభ
- జూనియర్ మహిళల విభాగంలో బంగారు పతకం
- 100కి 98 పాయింట్లతో అత్యధిక స్కోర్

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెనకొత్తూరు గ్రామానికి చెందిన జూనియర్ షూటర్ అయ్మాన్ ముస్కాన్ పఠాన్ 2వ తెలంగాణ సూపర్ బిగ్ బోర్ షూటింగ్ పోటీలు–2026లో బంగారు పతకం సాధించారు. ఆగస్టు 20, 21 తేదీల్లో ఇబ్రహీం పట్నం తట్టిఖానాలోని ఆక్టోపస్ కమాండో శిక్షణ కేంద్రంలో తెలంగాణ రైఫిల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆమె 100కి 98 పాయింట్లు సాధించి అత్యధిక స్కోర్ నమోదు చేశారు. జూనియర్ మహిళల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించిన అయ్మాన్,

మిగతా 2 లో...



## ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తులో లోపాలకు తావివ్వొద్దు

- పోలీసు అధికారులకు ప్రత్యేక శిక్షణ..
- పక్కా ఆధారాలతో కేసులు బలోపేతం చేయాలి : ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం (కలెక్టరేట్), ఆగస్టు 22, ప్రజాజ్యోతి:** మాదకద్రవ్యాలు మరియు మానసిక ప్రభావిత పదార్థాల చట్టం (ఎన్‌డీపీఎస్) కేసుల దర్యాప్తులో చిన్న పాటి లోపాలకు కూడా తావులేకుండా చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదయ్యే కేసుల దర్యాప్తుపై పోలీసు అధికారులకు ప్రత్యేక శిక్షణా తరగతులను శనివారం కొత్తగూడెంలోని ఐఎంఈ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్.హెచ్. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుల గుర్తింపు, అరెస్టు, మాదకద్రవ్యాల స్వాధీనం, పంచనామా, సాక్ష్యాల సేకరణ, కేసు దర్యాప్తు, చార్జ్‌షీట్ దాఖలు తదితర అంశాల్లో పాటించాల్సిన చట్టపరమైన విధానాలపై అవగాహన కల్పించారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని వివిధ సెక్షన్లు, వాటి అమలు

మిగతా 2 లో...

## మెనూ తప్పనిసరిగా పాటించాలి

- విద్యార్థులకు ఇబ్బందులు కలగవద్దు
- ఇల్లందులో హాస్టల్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే
- విద్యార్థులకు అందుతున్న భోజన పథకం పై ఎమ్మెల్యే ఆరా
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే
- విద్యార్థులతో మాటామంతి



**ఇల్లందు, ఆగస్ట్ 22 (ప్రజాజ్యోతి)** ప్రభుత్వ హాస్టల్ లలో విద్యనభ్యసించే విద్యార్థులకు మెనూ తప్పనిసరిగా పాటించాలని పాటించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. శనివారం ఇల్లందులోని బోజ్జాయిగూడెం, ఇల్లందు ఓల్డ్, న్యూ హాస్టల్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగవద్దని కోరారు. విద్యార్థులకు అందుతున్న భోజన పథకం పై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో

మిగతా 2 లో...

## విద్యార్థులు చదువు పైనే దృష్టి సాదించాలి

- వర్గ విభేదాలు లేకుండా కలిసిమెలిసి ఉండాలి
- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్



**గుండాల ఆగస్టు 22 ప్రజాజ్యోతి** విద్యార్థులు వర్గ విభేదాలు లేకుండా కెరియర్ పై దుస్థితి సాధించి చదువుకొని అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు శనివారం మండలంలోని ముత్తాపురం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించారు పాఠశాలలో జరుగుతున్న ఆందోళనకర పరిస్థితులను పరిశీలించేందుకు పాఠశాలను సందర్శించిన అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో విరివిరిగా సమావేశమై పాఠశాలలో జరుగుతున్న సంఘటనను అడిగి తెలుసుకున్నారు పాఠశాలలో జరుగుతున్న పరిణామాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలు చదువుకోవాలని ఎంతో నమ్మకంతో పంపించారని ఆ నమ్మకాన్ని

మిగతా 2 లో...

## గెలల రాకతో కళకళలాడుతున్న ఆయిల్ పామ్ కర్మాగారాలు

(మొదటి పేజీ తరువాయి...)

ఈ క్రమంలో శనివారం సాయంత్రం వేళకు ఒక్క అశ్వారావుపేట ఫ్యాక్టరీ ప్రాంగణంలోనే గెలల లోడుతో వచ్చిన 70 కి పైగా ట్రాక్టర్లు క్యూ కట్టి బారులు తీరి కనిపించాయి. గత కొన్ని రోజులుగా వెలవెలబోయిన యార్డులు ఇప్పుడు ట్రాక్టర్ల సవ్వడితో, లోడింగ్ / అన్‌లో డింగ్ పనులతో సందడిగా మారాయి. గెలల రాక ఒక్కసారిగా పెరగడంతో ఫ్యాక్టరీలలో ప్రాసెసింగ్ పనులు కూడా ఊపందుకున్నాయి.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తొలి షూటింగ్ బంగారు పతకం







(మొదటి పేజీ తరువాయి...)

జూనియర్, సీనియర్, వెటరన్ విభాగాల్లో పాల్గొన్న వారందరిలో అత్యధిక స్కోర్ సాధించడం విశేషం. సూపర్ బిగ్ బోర్ రైఫిల్ విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఇదే తొలి పతకం కావడం విశేషం. అయ్మాన్‌తో పాటు ఆమె తండ్రి రహీం పఠాన్, సోదరుడు రయాన్ పఠాన్ కూడా పోటీల్లో పాల్గొని తమ విభాగాల్లో అర్హత సాధించారు. అయ్మాన్, రయాన్ పఠాన్ తమ .22 రైఫిల్ విభాగాల్లో అఖిల భారత జి.వి. మావలంకర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. స్థానికంగా షూటింగ్ మౌలిక సదుపాయాలు లేకపోయినా తండ్రి, కోచ్ అబ్దుల్ నబీ మార్గదర్శకత్వంలో డ్రై–ఫైర్ సాధన, స్కాట్ ఎలక్ట్రానిక్ శిక్షణ వ్యవస్థ, చెక్క బుల్లెట్లతో క్రమం తప్పకుండా శిక్షణ పొందినట్లు అయ్మాన్ తెలిపారు. జిల్లాలో 50 మీటర్లు, 300 మీటర్ల షూటింగ్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. శిక్షణా కేంద్రాలు ఏర్పాటైతే జిల్లాలోని యువత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తన పిల్లలు సాధించిన విజయంపై తండ్రి రహీం పఠాన్ ఆనందం వ్యక్తం చేశారు. విజయానికి సహకరించిన తెలంగాణ రైఫిల్ సంఘం ప్రతినిధులు, కోచ్ అబ్దుల్ నబీ, శిక్షకులు, క్రీడా నిర్వాహకులకు పఠాన్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

## ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తులో లోపాలకు తావివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి...)

విధానం, కోర్టు విచారణ సమయంలో ఎదురయ్యే న్యాయపరమైన అంశాలు, సాక్ష్యాధారాల పరిరక్షణ, దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దర్యాప్తులో జరిగే చిన్నపాటి పొరపాట్లు కూడా కోర్టు విచారణ సమయంలో కేసులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి దశలోనూ చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఎన్‌డీపీఎస కేసుల్లో దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచి, నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో కేసులను దర్యాప్తు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్.హెచ్. రాజేశ్వరరావు సూచించారు. దర్యాప్తు అధికారులు కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ దర్యాప్తులో చోటుచేసుకునే లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాలని సూచించారు. ప్రతి కేసులోనూ చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ పక్కా ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శిక్షణలో చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎల్.హెచ్. రాజేశ్వరరావు, ఫణికుమార్‌లను ఎస్పీ అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్‌కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు, భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెనూ తప్పనిసరిగా పాటించాలి





(మొదటి పేజీ తరువాయి...)

కలిసి భోజనం చేసి వారితో మాట్లాడి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం రాత్రివేళ హాస్టల్ నుండి కొంతమంది విద్యార్థులు బయటికి వెళ్లడం జరిగిందని, మరల అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు ప్రజా ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక అవసరాలు కల్పన, విద్య విషయంలో ఎలాంటి లోటుపాట్లు జరిగిన తక్షణమే ఉపాధ్యాయులందరిని సస్పెండ్ చేసేందుకు వెనుకాడమని హెచ్చరించారు. హాస్టల్ లలో విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంతో వెచ్చించడం జరుగుతుందని, విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పిఏసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, బొజ్జాయి గూడెం ఉప సర్పంచ్ అరేం కిరణ్, నాయకులు మూగల మల్లేష్, గౌతమ్ రాజ్, హాస్టల్ అధికారులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## అర్ధరాత్రి ఆదివాసుల నేతల అరెస్ట్


- దీక్ష భగ్నం



**గుండాల ఆగస్టు 22 ప్రజా జ్యోతి** ఏకలవ్య పాఠశాలలో తీజ్ పండగ వ్యవహారంలో ఆదివాసి నేతల ఆందోళన అనంతరం అమర నిరాహార దీక్ష చేస్తున్న నేతలను శుక్రవారం అర్ధరాత్రి అరెస్టు చేసి దీక్షను భగ్నం చేశారు. గుండాల మండలం ముత్తాపురం గ్రామంలో ఏకలవ్య పాఠశాలలో లంబాడి సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులు తీజ్ పండుగను అట్టాసంగా చేయడానికి వ్యతిరేకిస్తూ, గిరిజన విద్యార్థులపై వివక్షతను ఖండించాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళన చేసిన అనంతరం శుక్రవారం ఉదయం అమర నిరాహార దీక్షకు గిరిజన సంఘాలు పోనుకోవడంతో శుక్రవారం పాఠశాల ముందు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో సమాచారం తెలుసుకున్న జిల్లా అధికారులు దివ్య నాయకులతోపాటు విద్యార్థులు మాట్లాడి సానుకూల వాతావరణ కోసం ప్రయత్నించిన విఫలం కావడంతో పోలీసులు దీక్షను భగ్నం చేసి అర్ధరాత్రి గిరిజన సంఘ నేతలను అరెస్టు చేశారు చుంచు రామకృష్ణ, అరుణ్ కుమార్, పెండ్లి కట్ల నాగరాజు, కల్తీ లక్ష్మణ్ లను అరెస్ట్ చేసి ఇల్లందుకు తరలించారు శనివారం ఉదయం విడుదల చేశారు

## సోమవారం రైతువేదికలో ప్రజావాణి

**ములకలపల్లి, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** మండల పరిషత్ కార్యాలయ భవనానికి ప్రత్యేక మరమ్మతు పనులు జరుగుతున్నందున ప్రజావాణి కార్యక్రమ వేదికను మార్చినట్లు ఎంపీడీవో ఎస్.వి. సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని ములకలపల్లి రైతువేదికలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు, మండల స్థాయి అధికారులు రైతువేదికలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు



## విద్యార్థులు చదువు పైనే దృష్టి సాదించాలి.

(మొదటి పేజీ తరువాయి...)

వమ్ము చేయకుండా శ్రద్ధతో చదువుకోవాలన్నారు పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థి తోటి విద్యార్థితో కలిసి మెలిసి ఉండి ఒకే కుటుంబం వలె ఉండాలని కోరారు . ఇంటిని తల్లిదండ్రులను వదిలి దూరంగా ఉంటూ చదువుకోవాలని వచ్చినప్పుడు అందరూ సమన్వయంతో ఉండి చదువుకోవాలని, నీది నాది అనే భావనను ఎవరు మనసులో పెట్టుకోకుండా అందరూ కలిసి చదువు పైన దృష్టిసాదించాలని కోరారు. ఉపాధ్యాయులు పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలని, పిల్లలను సన్మార్గంలో పయనించేలా మంచి మాటలు ప్రతిరోజు చెప్పాలన్నారు . దేవాలయం లాంటి విద్యాలయాలలో పోలీసులు ప్రవేశించరాదని, వారు ప్రవేశించారంటే కొంత తేడా ఉన్నట్లేనని ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడాలన్నారు . ఏ విధమైన చర్యలు సంఘటనలు జరిగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి వెనకాడమన్నారు .



# షోయబుల్లా ఖాన్ కు ఘన నివాళి

- కొత్తగూడెం ప్రెస్ క్లబ్ లో వర్ధంతి వేడుకలు



**కొత్తగూడెం, ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** కొత్తగూడెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయుడు, అమరుడు షోయబుల్లా ఖాన్ వర్ధంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన షోయబుల్లా ఖాన్ చిత్రపటానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడు తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీ సుకురావడంలో, వాస్తవాలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకురావడంలో షోయబుల్లా ఖాన్ చేసిన సేవలు చిరస్మరణీ యమని అన్నారు. పాత్రికేయ రంగంలో ఆయన ప్రదర్శించిన ధైర్యం, నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజ ల పక్షాన నిలబడి వాస్తవాలను నిర్భయంగా వెల్లడించడమే షోయబుల్లా ఖాన్ కు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షిస్టాఫర్ గోవింద్, ఐ న్యూస్ ఇన్ పుట్ ఎడిటర్ నవీన్, వెలుగు స్టాఫర్ రాజేందర్, మన తెలంగాణ స్టాఫర్ సత్య ప్రకాష్, విజన్ ఆంధ్ర స్టాఫర్ ఉమాకాంత్, ఉదయం స్టాఫర్ జీవన్, సీనియర్ పాత్రికేయులు లోగాని శ్రీనివాస్, మోటమర్రి రామ కృష్ణ, జునుమాల ర మేష్, రేశ్వంత్ పండుగ, రిపోర్టర్లు ఏ ర్పుల సుధాకర్, కొండా జంపన్న, కవ టం శ్రీనివాస్, కోల కుమార్, బిగ్ టీవీ నాగేశ్వర రావు, సీవీఆర్ రమేష్, అఫ్జల్ పఠాన్ తదితరులు పాల్గొని షోయబు ల్లా ఖాన్ సేవలను స్మరించుకున్నారు.

## ఘనంగా సురవరం సుధాకర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు




**చర్ల, ఆగస్టు 23 :(ప్రజా జ్యోతి):** సీపీఐ అగ్రనేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని శనివారం చర్ల మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి విలువలకు నిలువుటద్దమని, ప్రజా పోరాటాలకు ప్రతిరూపంగా నిలిచారని అన్నారు. విద్యార్థి దశ నుంచే పోరాట బాట పట్టిన ఆయన ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, జాతీయ అధ్యక్షుడిగా, ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) జాతీయ అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు.విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, పేదల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా ఆయన చిరస్మరణీయంగా నిలిచారని అన్నారు. ఆయన ఆశయాలు, విలువలను కొనసాగిస్తూ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.సీపీఐ చర్ల మండల సహాయ కార్యదర్శి కోటి ముత్యాలరావు, కోడిరెక్కల రాజారావు, మునిగల రామారావు, ఆంద్రూ వామనరావు, నరసింహరావు, మోడెం ఆదినారాయణ, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడికి ఘన సన్మానం



**బూర్గంపహాడ్, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి ):** మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన భూక్య మోహన్‌రావుకు కృష్ణసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. మండలంలోని ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌లను సమన్వయం చేస్తూ ముందుకు తీసుకెళ్లే బాధ్యతను మోహన్‌రావు చేపట్టడంపై గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.కృష్ణసాగర్ గ్రామ సర్పంచ్ తాటి వాణి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో భూక్య మోహన్‌రావును శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా మోహన్‌రావు ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ఉప సర్పంచ్‌లకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి పాలకవర్గ సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.తనపై నమ్మకంతో మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ మోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్‌ల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరి సహకారంతో పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఎం. నాగిరెడ్డి, గ్రామ పెద్దలు, ఉప సర్పంచ్‌లు తదితరులు పాల్గొని మోహన్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## సింగారంలో వైద్య శిబిరం

- జ్వర బాధితులకు రక్త పరీక్షలు.. మలేరియా నిర్ధారణ




**ఆళ్ళపల్లి. ఆగస్టు22(ప్రజా జ్యోతి )** ఆళ్ళపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోతికోయ గ్రామమైన సింగారంలో వైద్యాధికారి డాక్టర్ బి. గోపీలాల్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర బాధితులకు రక్తపూతలు, వేగవంతమైన రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు అందించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా రక్త పరీక్షలు నిర్వహించారు.వేగవంతమైన పరీక్షలో మలేరియా పాజిటివ్ (పీఎఫ్)గా నిర్ధారణ అయిన ఓ బాధితుడిని 108 వాహనంలో ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పెద్ద వెంకటాపురం పంచాయతీ సర్పంచ్ వజ్జ ఉమా సహకారంతో గ్రామంలో క్రిమిసంహారక మందు పిచికారీ చేయించారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో పొగ మందు పిచికారీ కూడా చేపడతామని సర్పంచ్ తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ గోపీలాల్ మాట్లాడుతూ ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల రక్త పరీక్షలు, వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో హెచ్ ఈఓ దొడ్డ రామకృష్ణ, ఆరోగ్య సహాయకుడు మంకిడి నరేష్, ఏఎన్ఎం వజ్జ సుగుణ, అంగన్‌వాడీ టీచర్ కృష్ణకుమారి, ఆశా కార్యకర్త బడిశా లక్ష్మితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఔదార్యాన్ని చాటిన ఆదివాసీ నాయకుడు



**ఇల్లందు, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి )** మండలంలోని లచ్చగూడెం గ్రామపంచాయతీ పరిధి కొమ్ముగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన విద్యుత్ ఘాతంతో ఇల్లు పూర్తిగా కాలిపోయిందన్న సమాచారం అందుకున్న ఆదివాసీ నాయకులు పెండకట్ల యాకయ్య శనివారం ఆ గ్రామానికి వెళ్లి ఆ కుటుంబానికి 150 కేజీల బియ్యం, రూ. 3 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ఆపదలో ఉన్నవారికి ఎవరికి తోచిన సాయం వారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శోభన్, సలీం, నరేష్, రవి పాల్గొన్నారు.

## శంకర్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం



**బూర్గంపహాడ్, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి ):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సపావత్ శంకర్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు పీఆర్టియూ ఆధ్వర్యంలో శంకర్ సతీమణికి రూ.లక్ష విలువైన చెక్కును ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంకర్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు భూక్య రామారావు, చందుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల గొంతుక సురవరం

- ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమే ఆయనకు నిజమైన నివాళి

**కొత్తగూడెం, ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** కమ్యూనిస్టు ఉద్యమాల్లో చెరగని ముద్ర వేసిన సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.కె. ఫహీం పిలుపునిచ్చారు. సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం కొత్తగూడెంలోని జిల్లా సీపీఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎస్.కె. ఫహీం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లో పాల్గొని అంచెలంచెలుగా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగిన మహోన్నత వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. కార్మికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆయన జీవితాంతం నిస్వార్థంగా పోరాడారని అన్నారు. పార్లమెంటు సభ్యుడిగా ప్రజా సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించి ప్రజా గళానికి ప్రతినిధిగా నిలిచారని గుర్తుచేశారు. వామపక్ష, ప్రజాస్వామిక శక్తుల ఐక్యత కోసం సురవరం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. పదవులు, హోదాలకు అతీతంగా ఆయన కొనసాగించిన నిరాడంబర జీవనం, సిద్ధాంత నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని అన్నారు. సురవరం చూపిన బాటలో ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఫహీం పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం కమ్యూనిస్టు కార్యకర్తలు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, నాయకులు ఎం.డి. యూసుఫ్, గోపికృష్ణ, ధర్మరాజు, మిర్యాల రాము, షహీన్, కైసర్, మేదిని లక్ష్మి, చోటు షరీఫ్, అఫ్జల్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్




**కొత్తగూడెం, ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అజిత్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూ నివర్సిటీలో అనుసంధానం చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఈ నిర్ణయం అమలైతే వేలాది మంది డిప్లొమా విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. డిప్లొమా విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్న లాటరల్ ఎంట్రీ విధానాన్ని రద్దు చేయవద్దని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నష్టం కలిగించే శక్తి పథకంతో పాటు జీవో నంబర్ 97ను కూడా ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. సాంకేతిక విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక నిర్ణయాలపై విద్యార్థులు, అధ్యాపకులతో ప్రభుత్వం చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సమస్యల పరిష్కారం కోసం ఆమరణ దీక్షకు సైతం సిద్ధమని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు సంజయ్, నాయకులు సలిగంటి జయదీప్, ముదిగొండ నిరీక్షణ, ప్రియాంషీ, సాయి కృష్ణ, నీలాద్రి, బండి హనికృష్ణ పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మెకు పిలుపు

- సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ పిలుపు



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి):** ఆటో, ఇతర రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆగస్టు 24 నుంచి జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ కోరారు. శనివారం స్థానిక ఆటో అడ్డా వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు పక్క రాష్ట్రంలో ఇస్తున్న విధంగా రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని, వారిని ఆదుకుంటామని చెప్పి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ ఆటోలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అందుకు బదులుగా ప్రస్తుతం ఆటో డ్రైవర్ల వద్ద ఉన్న ఈవీ ఆటోలను ప్రజా రవాణా కోసం వినియోగించాలని కోరారు. ఆర్టీసీ తర్వాత ప్రజా రవాణా వ్యవస్థలో ఆటో రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రమాదాలు జరిగితే వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తగిన సహాయం అందడం లేదన్నారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మురహరి రఘు, సురేష్, రవి, చెన్నారావు, ముఖర్జీ, రాము, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఓబీసీ జిల్లా కమిటీకి కసరత్తు

- ఈ నెల 26న దరఖాస్తుల స్వీకరణ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన ఓబీసీ జిల్లా కమిటీ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. టీపీసీసీ ఓబీసీ చైర్మన్ ఆదేశాల మేరకు నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. జిల్లాలోని వివిధ మండలాలు, డివిజన్లు, పట్టణాలు, నియోజకవర్గాల స్థాయిలో ఓబీసీ విభాగంలో పనిచేస్తున్న వారు జిల్లా కమిటీలో బాధ్యతలు చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు ఈ నెల 26న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లా ఓబీసీ కమిటీ ఏర్పాటుతో వెనుకబడిన వర్గాలను పార్టీతో మరింతగా అనుసంధానం చేయడంతో పాటు, ఆయా వర్గాల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కమిటీలో పనిచేయడానికి ఆసక్తి ఉన్న అర్హులైన నాయకులు, కార్యకర్తలు నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఓబీసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిశీలకులు అనిల్‌కుమార్, పింద్రాల రాందాసు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్నను కలసి కమిటీ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్తీక్, డీసీసీ జిల్లా కమిటీ సభ్యులు పెద్దబాబు, శేఖర్, జానీపాషా, నాగార్జున తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## బీసీ మహిళలకు కుట్టు మిషన్లు

- సెప్టెంబర్ 13 వరకు దరఖాస్తులు.. 18 నుంచి 55 ఏళ్ల వారికి అవకాశం

**కొత్తగూడెం (కలెక్టరేట్) ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** జిల్లాలోని నిరుద్యోగ బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో కుట్టు మిషన్లు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పి.విజయలక్ష్మి తెలిపారు. ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం కింద అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే మహిళల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. నిరుద్యోగ మహిళలు, వితంతువులు, నిరాశ్రయులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, అనాథ మహిళలు, టైలరింగ్ శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుందని అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులకు తెల్లరేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు ఇతర అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కుట్టు మిషన్ యూనిట్ కోసం అర్హతను బట్టి రుణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ ఓబీసీఎఫ్ పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అర్హులు కారని స్పష్టం చేశారు. అర్హులైన మహిళలు 13-09-2026లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తులను tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి కుట్టు మిషన్ల పథకం ద్వారా ప్రయోజనం కల్పించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పేర్కొన్నారు.

## జీఓ 97 రద్దు చేయాలి

- పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలి
- పాల్వంచలో బీఆర్ఎస్వీ ధర్నా




**పాల్వంచ, ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** జీఓ నంబర్ 97ను వెంటనే రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు బీఆర్ఎస్వీ, యువజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అఖిల్ మహర్షి, హసీబ్ ఆధ్వర్యంలో పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీఓ నంబర్ 97తో పాలిటెక్నిక్ విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే జీవోను రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగాలు అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకురాలు, కార్పొరేటర్ సింధు తపస్వి, గణేష్, నరసింహ, అంజద్, రవి, జానకిరామ్, ప్రశాంత్, శశాంక్, హరి, క్రాంతికుమార్, సాయి, నాగు, బన్ను తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి సురవరం సుధాకర్ రెడ్డి

- పాల్వంచలో ఘనంగా ప్రథమ వర్ధంతి



**పాల్వంచ, ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం సురవరం నిస్వార్థంగా పోరాడారని కొనియాడారు. విద్యార్థి, యువజన ఉద్యమాలకు జాతీయ స్థాయిలో నాయకత్వం వహించి, పార్లమెంటేరియన్‌గా ప్రజా సమస్యలను బలంగా వినిపించారని గుర్తుచేశారు. సురవరం ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉప్పుశెట్టి రాహుల్, వీ.పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, డి.చెన్నయ్య, బిక్కులాల్, ఎస్.కె.కరీం పాల్గొన్నారు.

## కనకేష్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

- సొసైటీ వైస్ చైర్మన్‌ను సత్కరించిన కొత్వాల

**పాల్వంచ, ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్ జన్మదిన వేడుకలు సందర్భంగా సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కనకేష్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కనకేష్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవతో పాటు సొసైటీ అభివృద్ధిలో మరింత చురుగ్గా పనిచేయాలని కోరారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా కనకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపతి రామలింగం, కొండం వెంకన్నగౌడ్, ఎ.డి.ఇ. వై. వెంకటేశ్వరరావు, బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# శేషగిరిరావును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే తాటి

**ములకలపల్లి ఆగస్టు 22, (ప్రజాజ్యోతి):** మండల కేంద్రానికి చెందిన మన తెలంగాణ రిపోర్టర్, ములకలపల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు అయితా శేషగిరిరా వు శస్త్రచికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తె లుసుకున్న అశ్వారావు పేట మాజీ ఎ మ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు శనివారం ఆయనను



పరామర్శించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు ఆరోగ్య పరిస్థితిని తాటి వెంకటేశ్వర్లు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించా రు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీ సీ శన గపాటి మెహరామణి, మాజీ స ర్పంచులు బైటి రాజేష్, వాడే నాగరా జు, బీఆర్ ఎస్ నాయకులు శనగపా టి సీతారాములు, బండి కొమురయ్య, పుష్పాల చంద్రావు, కొండవీటి రాజా రావు, ఎలమంచిలి సునీల్, పుష్పాల సాయి, పుష్పాల హనుమంతు, మహే ష్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**అశ్వారావుపేట, ఆగస్టు 22 (ప్రజా జ్యోతి ):** అశ్వారావుపేట రింగ్ రోడ్డు సెంట ర్లోని వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం స్థానికులకు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చిరంజీవి కేవలం వెండితెరపైనే కాకుండా నిజ జీవితంలోనూ బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ మరియు ఇతర సామాజిక కార్యక్రమాల ద్వారా సమాజానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన సేవా గుణం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోకురిసెట్టి నాగబాబు నాయుడు (చిరంజీవి సేవా సమితి డివిజన్ అధ్యక్షులు) ఉపాధ్యాయుల సూర్యప్రకాష్ రావు (మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ కోఆర్డినేటర్) చిన్నంశెట్టి సత్యనారాయణ మాధురి మధు తాడేపల్లి రవి ఎర్ర అప్పారావు వాసా ఏసుబాబు పసుపులేటి ఫణీంద్ర కట్ట సుబ్బారావు దామర అయ్యప్ప మరియు తదితరులు.

## జీవో 97ను రద్దు చేయాలి





**ములకలపల్లి ఆగస్టు 22 (ప్రజాజ్యోతి):** జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో శనివారం ములకలపల్లి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. జీవో 97తో విద్యార్థుల ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి అప్పారావు, శనగపాటి సీతారాములు, బండి కొమరయ్య, కొండవీటి రాజారావు, పుష్పాల చందర్‌రావు, పుష్పాల హనుమంతు, తాటి ప్రవీణ్, పొడియం ప్రేమ్‌కుమార్, సోహెల్, తన్నీరు శ్రీకాంత్, కొండవీటి చంద్రశేఖర్, యలమంచిలి సునీల్, పుష్పాల సాయి, జైభీమ్ నర్సింహా, గండూరి ప్రమోద్, పత్తి బిక్షం, బొర్రా రవి, మీడియం మహేష్, ఊరపెద్ది దినేష్, తాళ్ల శ్రీను తదితరులు, విద్యార్థులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల భర్తీలో దళారులను నమ్మొద్దు

- పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ.. అర్హత, మెరిట్ ఆధారంగానే నియామకాలు




**పాల్వంచ (కలెక్టరేట్), ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు. పోస్టులు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని సూచించారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉద్యోగాలు ఇప్పిస్తామని, అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పే వ్యక్తులను నమ్మి ఎవరికీ డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావుండదని స్పష్టం చేశారు. అంగన్వాడీ పోస్టుల ఎంపిక ప్రక్రియకు జిల్లా కలెక్టర్ చైర్మన్ గా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత అర్హతలు, రిజర్వేషన్ నిబంధనలు, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎవరికీ ముందుగానే ఉద్యోగం ఖరారయ్యే అవకాశం లేదని, పూర్తిగా నిబంధనల ప్రకారమే ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. వచ్చే వారంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించిన తేదీ, సమయం, ఇతర వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని జిల్లా సంక్షేమాధికారి వెల్లడించారు. అభ్యర్థులు అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని, దళారుల మాటలు నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని సూచించారు.

## సురవరం ఆశయ సాధనే ఆయనకు నిజమైన నివాళి

- సిపిఐ రాష్ట్ర నాయకుడు సయ్యద్ సలీమ్
- మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి



**అశ్వరావుపేట (ప్రజాజ్యోతి ఆగస్టు 22:** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సభను అశ్వరావుపేట మండల సిపిఐ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సయ్యద్ సలీమ్ మాట్లాడుతూ... సురవరం సుధాకర్ రెడ్డి తన జీవితాంతం పేదలు, కార్మికులు, రైతాంగం మరియు పీడిత వర్గాల హక్కుల పరిరక్షణ కోసమే పోరాడారని స్మరించుకున్నారు. పార్లమెంటు లోపలా, బయటా శ్రమజీవుల గొంతుకై నిలబడిన గొప్ప బహుజన ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ, ఆశయ సాధనకు కృషి చేయడమే సురవరానికి మనంర్పించే నిజమైన నివాళి అని సలీమ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ నాయకులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన కొత్వాల

- వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**పాల్వంచ, ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు, కళాకారుడు షేక్ ఖాసిం, బీబీ దంపతుల కుమార్తె షేక్ కరీష్మ వివాహ వేడుకల్లో సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస రావు పాల్గొన్నారు. వధూవరులను ఆశీర్వదించి వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకకు హాజరైన కొత్వాలను కుటుంబ సభ్యులు, నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రముఖులు నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దమ్మగుడి మాజీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండం వెంకన్నగౌడ్, ఎ.డి.ఇ. వై. వెంకటేశ్వరరావు, బూసి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

- పాల్వంచలో ప్రత్యేక అవగాహన సదస్సు



**పాల్వంచ, ఆగస్టు 22, ప్రజా జ్యోతి :** పాల్వంచలోని పీయంకి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలిక సాధికారత, కిశోర బాలికల సంరక్షణ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, విద్య ప్రాముఖ్యత, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. బాలికల భద్రత కోసం ప్రభుత్వం, జిల్లా స్థాయిలో చేపడుతున్న సంరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు హాజరై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. బాలికలు విద్యతోపాటు ఆరోగ్యం, భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్య ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చని, సమాజంలో అన్ని రంగాల్లో బాలికలు ముందంజలో ఉండాలని పేర్కొన్నారు. బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి అధికారులు వివరించారు. బాలికలు తమ సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పార్థివదేహానికి తాటి వెంకటేశ్వర్లు నివాళి



**ములకలపల్లి, ఆగస్టు 22 (ప్రజాజ్యోతి ):** రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ములకలపల్లి మండల కేంద్రానికి చెందిన మిరియాల శంకర్‌రావు పార్థివదేహానికి అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శనగపాటి మెహరామణి, మాజీ సర్పంచ్‌లు బైటి రాజేష్, వాడే నాగరాజు, నరటి ప్రసాద్, మిరియాల కమలాకర్, బండారి శ్రీను, శనగపాటి సీతారాములు, బండి కొ మురయ్య, పుష్పాల చంద్రావు, కొండవీటి రాజారావు, కేసరి వెంకటేశ్వర్లు, ఎలమంచిలి సునీల్, పుష్పాల సాయి, పుష్పాల హనుమంతు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.